

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శుక్రవారం 06 మార్చి 2026 పేజీలు : 04


# శేష వాహనంపై నరసింహుడు



శేషవాహనంపై దర్శనమిస్తున్న నరసింహుడు

**కదిరి, మార్చి 5 ప్రభాతవార్త**

శ్రీమత్‌ఖాద్రి లక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీదేవి భూదేవి సమేతుడైన నరసింహుడు భక్తులకు శేష వాహనంపై కనువిందు చేశారు.

ఉదయం నిత్య పూజ హోమం అనంతరం యాగశాల నుంచి బయల్దేరి శ్రీవారు తిరువీధుల్లో విహరించారు. కదిరి మల్లెల, సౌరభాను వెంట తీసుకురాగా విద్యుత్ దీప కాంతుల నడుమ స్వామివారి దర్శనం కోసం వేలాది మంది భక్తులు తిరువీధుల్లో బారులు తీరారు. ఉత్సవంలో ఆలయ ఈఓ వెండిదండి శ్రీనివాసరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**నేడు సూర్య చంద్రవాహనంపై..**

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లోభాగంగా శుక్రవారం స్వామివారు సూర్యచంద్రవాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఉదయం వేళ సూర్య ప్రభ, రాత్రివేళల్లో చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనం ఇస్తారు.



స్వామివారిని దర్శించుకోవడానికి విచ్చేసిన భక్తులు

### పామిడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో

# ఏసీబీ దాడులు

- లంచం తీసుకుంటూ పట్టుపడ్డ రాధా రమణ, అసిస్టెంట్ వెంకటేష్
- ఎవరైనా ఫిర్యాదు చేస్తే అవినీతిని అరికట్టి అధికారులపై చర్యలు చేపడుతాం
- వివరాలను వెల్లడించిన ఏసీబీ డిఎస్పీ ప్రసాద్‌రెడ్డి, సిఐ హమీద్‌ఖాన్



లంచం తీసుకుంటూ పట్టుపడ్డ సబ్ రిజిస్ట్రార్ రాధా రమణ

**పామిడి, మార్చి 05 ప్రభాతవార్త**

పామిడికి చెందిన జుల్ ఫక్రుల్ నుండి ఇంటి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం సభ్-రిజిస్ట్రార్ రాధా రమణ అతని అనుచరుడు చిన్న అలియాస్ వెంకటేష్ ద్వార రూ.25 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుపడ్డ సంఘటన గురువారం సాయంత్రం సభ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో చోటుచేసుకుంది. సంఘటనకు సంబందించి ఏసీబీ డిఎస్పీ ప్రసాద్‌రెడ్డి, సిఐ హమీద్‌ఖాన్ విలేఖరుల సమావేశంలో తెలిపిన వివరాలిలావున్నాయి. తన ఇంటి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం సభ్-రిజిస్ట్రార్ రాధా రమణ రూ.25 వేలు డిమాండ్ చేశారంటూ జుల్ ఫక్రుల్ అనంతపురం ఏసీబీ కార్యాలయంలో ఫిర్యాదు చేయటం జరిగిందన్నారు. దీంతో అందిన ఫిర్యాదు మేరకు సభ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో దాడులు చేపట్టి సభ్-రిజిస్ట్రార్ రాధా రమణ అనుచరుడు చిన్న అలియాస్ వెంకటేష్ జుల్ ఫక్రుల్ నుండి డబ్బులు తీసుకుంటుండగా పట్టుకున్నామని తెలిపారు. సభ్-రిజిస్ట్రార్ రాధా రమణ, అతని అనుచరుడు చిన్న అలియాస్ వెంకటేష్‌పై కేసు నమోదు చేసి డబ్బును రికవరీ చేశామని ఇందుకు సంబందించి రికార్డులను పరిశీలిస్తున్నామని తదుపరి చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలియజేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు చేయాల్సిన పనులకు లంచం తీసుకోవటం చట్టరీత్య నేరం అని ఎక్కడైనా అవినీతి జరుగుతున్నట్లు మా దృష్టికి తీసుకొస్తే వాటిని అరికడుతూ అధికారులపై కేసులు నమోదు చేసి చర్యలు చేపడుతామని వారు వెల్లడించారు.




వివరాలను వెల్లడిస్తున్న ఏసీబీ డిఎస్పీ ప్రసాద్‌రెడ్డి, సిఐ హమీద్‌ఖాన్

# మీ జిల్లాలో ప్రజలు ప్రభుత్వ పథకాల పట్ల సంతృప్తిగా లేరు

- మీరు జనాల్లోకి వెళ్లకపోవడమే ఇందుకు కారణం
- ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవద్దు
- సమన్వయంతో జిల్లా అభివృద్ధికి పాటుపడండి
- తాడేపల్లిలో అనంత ప్రజా ప్రతినిధులతో సీఎం చంద్రబాబునాయుడు



తాడేపల్లిలో అనంతపురం జిల్లా ప్రజా ప్రతినిధులతో సమావేశమైన సీఎం చంద్రబాబు నాయుడు

**అనంతపురం, మార్చి 5, (ప్రభాతవార్త బ్యూరో)**

మీ వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా చూడండి. ప్రభుత్వ పథకాలను ప్రజలే తీసుకెళ్లేందుకు సమన్వయంతో పని చేయండి. కొన్ని ప్రభుత్వ పథకాల పట్ల ప్రజల్లో సంతృప్తి కనపడటం లేదు. అందుకు కారణం మీరే. మీరు తరచూ ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలను తెలుసుకోకపోవడం, ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకోకపోవడం వల్లే ప్రజల్లో సంతృప్తి కలగడం లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనంతపురం జిల్లా ప్రజా ప్రతినిధుల సమావేశంలో ఆక్రోసం వెళ్లగక్కినట్లు సమాచారం. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయి మీరు గట్టిగా పని చేసి జనాల్లో ఉంటేనే మంచి ఫలితాలు వస్తాయన్న విషయాన్ని గుర్తించాలని సీఎం గట్టిగానే మాట్లాడినట్లు తెలియ వచ్చింది. తాడేపల్లిలోని సీఎం నివాసంలో గురువారం ఉదయం అనంతపురం జిల్లా అభివృద్ధిపై దాదాపు రెండు గంటల పాటు జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీ, మంత్రులతో సీఎం ప్రత్యేకంగా సమీక్షించి వారికి దిశ నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా ఇన్చార్జి మంత్రి టి.జీ. భరత్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రభుత్వ విప్ రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వల శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు కుమ్మనూరు జయరాం, బండారి శ్రావణి, జేసీ అస్మిత్ రెడ్డి, దగ్గుబాటి ప్రసాద్, అనంతపురం జిల్లా కలెక్టర్ ఆనంద్, జిల్లా ఎస్పీ జగదీష్ కూడా పాల్గొన్నారు. తాడేపల్లిలో ఉదయం 8:00 నుంచి 10 గంటల వరకు జరిగిన సమావేశంలో సీఎం చంద్రబాబు అనంతపురం జిల్లా అభివృద్ధిపై చర్చించడం విశేషం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, అనంతపురం జిల్లాలో జరిగిన అభివృద్ధి పనులు పోల్చుతూ సీఎం సమీక్ష నిర్వహించినట్లు, కొన్ని సందర్భాల్లో ప్రజా ప్రతినిధులకు గట్టిగా వార్నింగ్ ఇచ్చినట్లు తెలియ వచ్చింది. ప్రభుత్వ పథకాల గురించి రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేసినప్పుడు ఉదాహరణకు అనంతపురం జిల్లాలో పంచాయతీరాజ్ రోడ్లు, బాలామృతం విషయంలో ప్రజలు సంతృప్తిగా లేరని రిపోర్టులు వచ్చాయని సీఎం చంద్రబాబు ప్రస్తావించినట్లు సమాచారం. మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు సమన్వయంతో పనిచేయాలని, కూటమిప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను తీసుకెళ్లాలని సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేసినట్లు తెలియ వచ్చింది. ఈ సమావేశంలో అనంతపురం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై సీఎం ప్రత్యేకంగా ఎమ్మెల్యేలను వివరాలు తెలుసుకుని సమీక్ష నిర్వహించినట్లు తెలియదు.. అదే సమయంలో జిల్లాలో అభివృద్ధి పథకాలు అమలకు సంబధించి జిల్లా కలెక్టర్ ఆనంద్, జిల్లాలో శాంతి భద్రతలకు సంబధించి జిల్లా ఎస్పీ జగదీష్ పలు విషయాలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలియ వచ్చింది. సీఎంకు వినతిలో ఎమ్మెల్యేలు వెల్లువ... తాడేపల్లిలో సీఎం నివాసంలో గురువారం ఉదయం జరిగిన ప్రత్యేక సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలకు సంబధించి పలు సమస్యలపై వినతి పత్రాలు ఇచ్చారు. ఎమ్మెల్యేలు పోటీపడి సీఎం దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లి నిధులు కేటాయించాలని కోరినట్లు సమాచారం. అర్బన్ నియోజకవర్గ అభివృద్ధిపై సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే దగ్గుపాటి విజ్ఞప్తి. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో జరుగుతున్న పనులకు సంబధించి ఎమ్మెల్యే దగ్గుపాటి ముఖ్యమంత్రి చంద్రబాబుకి వివరించారు. ఆ తర్వాత ఆయన్ని ప్రత్యేకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఇందులో నడిమివంక, మరువ వంకలకు ప్రొటెక్షన్ వాల్స్ కి సంబధించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. భారీ వర్షాల సమయంలో ఈ వంకలు పొంగి పొరలి చాలా కాలనీలు నీట మునుగుతున్నాయని.. అందుకే వీటికి రక్షణ గోడలు నిర్మించాలన్నారు. ఇందుకు సంబధించి జల వనరులశాఖ రూ.79.46కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసిందన్నారు. అలాగే నగరంలో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులకు కోసం 2023సంవత్సరంలో రూ.25కోట్లు అంచనా పనులు చేపట్టారన్నారు. అప్పట్లో కేవలం రూ.6.165కోట్లు మంజూరు చేశారన్నారు. మిగిలిన రూ.18.84 కోట్లతో రోడ్లు, రక్షిత నీటి సరఫరా, వీధిలైట్లు, టాయిలెట్ సౌకర్యాలు వంటి పనులు చేపట్టాల్సి ఉందన్నారు. వాటికి సంబధించిన నిధులు కేటాయించాలని కోరారు. అలాగే నగర శివారులోని శిల్పారామాన్ని గత ప్రభుత్వం పట్టించుకోకపోవడం వలన అక్కడ చాలా సమస్యలు నెలకొన్నాయని ముఖ్యమంత్రికి వివరించారు. ఇక్కడ మరమ్మతులు, పరికరాల భర్తీ, పార్కులో అదనపు మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.9.95కోట్లు కేటాయించాలని కోరారు. మరోవైపు అనంతపురం నియోజకవర్గానికి సంబధించి కూడేరు మండలం ముద్దలాపురంలో 16ఎకరాల భూమి ఉందని.. అక్కడ సోలార్ పార్కు ఏర్పాటుకు రూ.16కోట్ల రూపాయులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అన్నింటికీ సంబధించిన ప్రతిపాదన పత్రాలను కూడా సీఎంకు అందజేశారు. వీటిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. త్వరలోనే వీటికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.




వైద్యారోగ్య శాఖామంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ కు వెలగపూడి లోని ఏపీ సచివాలయంలో వినతి పత్రాన్ని అందజేస్తున్న ఆశా వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు. ఫ్యామిలీ వెల్ఫేర్ కమీషనర్ చిత్రంలో ఉన్నారు

# అనంతలో బుసలు కొట్టిన వరకట్న దాహం



ఆత్మహత్యయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న అశ్విని

- అత్తింటి వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం
- సెల్ఫీ వీడియోలో నిద్ర మాత్రలు మింగిన అశ్విని
- తన కుమారుడికైనా న్యాయం చేయాలని వేడుకోలు
- ఆరోగ్య పరిస్థితి విషమం

**అనంతపురం క్రైమ్ మార్చి 5, ప్రభాతవార్త**

అనంతలో వరకట్న దాహానికి ఓ వివాహిత ఆత్మహత్యయత్నానికి ఒడికట్టింది. అత్తింటి వారి వేధింపులకు తాళలేక జీవితంపై విరక్తి చెందింది. కటుకున్న భర్తతోపాటు అత్త, మామ తనను పుట్టింటి నుండి అదనపు కట్నం తేవాలని నిత్యం వేదిస్తున్నారని ఆరోపించింది. దీంతో విసిగి వేసారిన బాధితురాలు అత్తింటి వేధింపులకు తాళలేక అక్కడి నుండి కుమారుడిని తీసుకొని వచ్చేసింది. గత నాలుగేళ్ళ కిందట అమ్మా నాన్నలతో కలిసి పుట్టిం ట్లోనే నివాసం ఉంటోంది. తనకు న్యాయం చేయాలని స్థానిక దిశ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. అయినా గత మూడు మాసాలుగా స్టేషన్ చు ట్టూ తిరిగినా తనకు న్యాయం జరగలేదంటూ కలత చెందింది. దీంతో ఆత్మహత్యాయత్నానికి ముందుగా ఓ సెల్ఫీ వీడియో విడుదల చేసింది. అత్తింటి వేధింపులు తాళలేకే తాను సూసైడ్ చేసుకోబోతున్నానని ప్రత్యక్షంగా తన వెంట వున్న 25 నిద్ర మాత్రలు మింగింది. తనకు ఎలాగూ న్యాయం జరగలేదని కన్నీటి పర్యంతం అయ్యింది. కనీసం తన కుమారుడికైనా న్యా యం చేయాలంటూ ఆవేదన చెందింది.

అనంతపురం నగరంలోని బ్రాహ్మిన్స్ స్ట్రీట్ లో నివాసముంటున్న అశ్విని 2006లో ఆమెకు వివాహమైనా ఎన్నో ఏళ్లుగా ఆమెను కట్నం కావాలంటూ భర్త వేధింపులు చేస్తూ వచ్చాడు. ఈ నేపథ్యంలోనే కొద్ది రోజులుగా అశ్విని భర్తతో విడిపోయి పుట్టింటిలో అమ్మ వాళ్లతో కలిసి ఉంది. అయినా భర్త ఆమెను ఎన్నో విధాలుగా కించపరుస్తూ నిందలు మోపుతూ వేధిస్తూ వస్తు న్నాడని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తోంది. అయితే ఆమె గత ంలో ఇచ్చిన కట్నం తాలూకా ఆస్తు లన్నీ తిరిగి ఇవ్వమని ఎన్నో సార్లు మనవి చేసినా స్పందన లభించక పోవడంతో పలు మార్లు పోలీస్ స్టేషన్లు ఆశ్రయించింది.

మహిళా పోలీస్ స్టేష న్లో ఫిర్యాదు చేసినప్పటికీ కనీసం ఆమె తరపున ఎఫ్ఐఆర్ కూడా చేయలేదని బాధితురాలు అశ్విని ఆవేదన చెందింది. ముఖ్యంగా దిశా పోలీస్ స్టేషన్ డీఎస్పీ మహబూబ్ బాషా ఆమె పట్ల నిర్లక్ష్యంగా వ్యవ హరించడం, అసభ్య కరంగా మాట్లాడటం చేశాడని బాధితురాలు అశ్విని ఆరోపించింది. అయితే తనకు ఎలాగూ న్యాయం చేయలేదు.. కనీసం తను మర ణిస్తే తన కుమారుడికి న్యాయం చేయా లంటూ సెల్ఫీ వీడియోలో అభ్యర్థించింది. ఒకవేళ నేను మరణిస్తే తన కుమారుడి తరఫున న్యాయం జరిగేలా ఎవరైనా బాధ్యత తీసుకోవాలని వేడుకుంటూ నిద్రమాత్రలు మింగింది. అపస్మారక స్థితిలో వున్న బాధితురాలిని వెంటనే వైద్య చికిత్సల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యు లు తెలియజేసారు. 24 గంటలు గడిస్తే కానీ ఏమీ చెప్పలేమన్నారు.

# పారదర్శకంగా క్రీడాకారుల ఎంపికకు ప్రాధాన్యత ఇస్తున్నాం

- ఏడిసిఏ అధ్యక్షులు శ్రీనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏడిసిఏ అధ్యక్షులు శ్రీనాథ్

**అనంతపురం సిటీ, మార్చి 5 ప్రభాతవార్త**

పారదర్శకంగా క్రీడాకారుల ఎంపికకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అనంతపురం జిల్లా క్రికెట్ అసోషియేషన్ అధ్యక్షులు శ్రీనాథ్ పేర్కొన్నారు. ఆర్డిటి సమావేశ మందిరంలో గురువారం ఏడిసిఏ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏడిసిఏ అధ్యక్షులు శ్రీనాథ్, కార్యదర్శి యుగంధర్‌రెడ్డిలతోపాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో క్రికెట్ అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించారు. కమిటీ సభ్యుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు శ్రీనాథ్ మాట్లాడుతూ.. క్రీడాకారుల ఎంపికకు సీనియర్ క్రీడాకారులతో ఎంపిక కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సీనియర్ క్రీడాకారుల ఎంపికకు కెఎ ఫయాజ్ అహ్మద్ చైర్మన్‌గా, షాషావలి, ఇంతియాజ్‌లను ఎంపిక చేయడం జరిగిందన్నారు. అదే విధంగా జూనియర్ క్రీడా కారుల ఎంపికపై ప్రశాంత్‌కుమార్ చైర్మన్‌గా శివరాజ్, ఇర్ఫాన్‌లను కమిటీలో నియమించడం జరిగిందన్నారు. అదే విధంగా మహిళా క్రీడాకారుల కమిటీని చైర్మన్‌గా అనిత, గౌసియా బేగం, మంజుళ దేవిల ఆధ్వర్యంలో నియమించడం జరిగిందన్నారు. అదే విధంగా మహిళా క్రికెట్ ఆర్గనైజింగ్ కమిటీని నాగప్ప, అనిత, లత దేవిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళా క్రీడాకారుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. సెలక్షన్ కమిటీలో సీనియర్ ఆటగాళ్లతోపాటురంజి ట్రోఫీ క్రీడా కారులకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. నాలుగు మ్యాచ్‌లను ఎంపిక చేసిన క్రీడాకారులతో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు లీగ్ మ్యాచ్‌లు నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సెలక్షన్ కమిటీని ఏడిసిఏ వైస్ ప్రెసిడెంట్ నూర్‌ఖాన్, జాయింట్ సెక్రెటరీ సర్దార్‌లు పర్యవేక్షిస్తారన్నారు. ఏడిసిఏ చేపడుతున్న కార్యక్రమాలకు ఏసిఏ సంపూర్ణ సహకారం అందిస్తోందని పేర్కొన్నారు. ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా ప్రావీణ్యం కలిగిన క్రీడా కారులను జట్టులోకి తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఏడిసిఏ జాయింట్ సెక్రెటరీ సర్దార్, కౌన్సిలర్ అన్సారీఖాన్, కమిటీ సభ్యులు చంద్రమోహన్‌రెడ్డి, ప్రసన్న, విజయ్, ప్రసాద్, సాధిక్, భీమలింగారెడ్డి, మోహన్, హరినాథ్‌రెడ్డి, రఫి, మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరిని పరామర్శించిన రాజకీయ నేతలు



హనుమంతరాయ చౌదరిని పరామర్శిస్తున్న రాజకీయ నేతలు

**కళ్యాణదుర్గం, మార్చి 5 ప్రభాతవార్త**

కళ్యాణదుర్గం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హనుమంత రాయ చౌదరిని గురువారం పలువురు రాజకీయ నేతలు పరామర్శించారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆయనను సవేరా ఆసుపత్రికి వెళ్లి రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం రామ్మోహన్ చౌదరి, మాజీ జడ్పీటీసీ ఆర్.జి. శివశంకర్ తదితరులు కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు హనుమంతరాయ చౌదరి త్వరగా కోలుకుని ఆకాంక్షించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులు సతీమణి లక్ష్మీదేవి, కుమారు లు మారుతి చౌదరి, ఉదయ్ భాస్కర్ చౌదరిని కలిసి వైద్య చికిత్స వివరాలను తెలుసుకుని ధైర్యం చెప్పారు. జిల్లా లోని కూటమి పార్టీల నాయకులతో పాటు వైసీపీ నేతలు కూడా పార్టీలకు అతీతంగా హనుమంతరాయ చౌదరి త్వరగా కోలుకోవాలని కోరుకోవడం విశేషంగా నిలిచింది.

# కనేకల్‌లో టవర్ రూమ్‌లో మంటలు..

## సమయానికి స్పందించిన స్థానికులు

కనేకల్ మార్చి 5 ప్రభాతవార్త :



కనేకల్ పట్టణంలో గురువారం మధ్యాహ్నం స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. పట్టణం లోని నేషనల్ స్కూల్ సమీపంలో ఉన్న టవర్ రూమ్‌లో మధ్యాహ్నం సుమా రు 4 గంటల 30 నిమిషాల సమయంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగా యి. టవర్ రూమ్ నుంచి పొగలు ఎగసిపడటం గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై అక్కడికి చేరుకుని తక్షణ చర్యలు చేపట్టారు. స్థానిక యువకులు ధైర్యంగా ముందుకు వచ్చి నీరు మరియు అందుబాటులో ఉన్న ఇతర సాధనాలతో మంటలను అదుపులోకి తెచ్చారు. వారి చాకచక్యంతో మంటలు పెద్ద ఎత్తున వ్యాపించకుండా అడ్డుకోవడంతో సమీపంలోని భవనాలు, ఇళ్లు ప్రమాదం నుంచి తప్పించుకున్నాయి. ఈ ఘటనతో కొద్దిసేపు ప్రాంతంలో ఆందోళన నెలకొంది. అయితే స్థానికుల సమయోచిత చర్యల వల్ల పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉండవచ్చని అనుమానం వ్యక్తమవుతోంది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఉపశమనంగా మారింది. అయినప్పటికీ టవర్ రూమ్‌లో కొంత ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. ఘటనపై అధికారులు మరింత వివరాలు సేకరిస్తున్నారు.

# జాతీయ అవార్డు గ్రహీత కు సన్మానం



అనూషకు బాల మేధావి పాఠశాల యాజమాన్యం సత్కారం

డి.హిరెహాళ్ మార్చి 5 ప్రభాతవార్త

జాతీయస్థాయిలో స్త్రీ శక్తి అవార్డుకు ఎంపికైన సామాజిక సేవా కార్యకర్త అనూష ను బాలమేధావి ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ వన్నూరు స్వామి ఆధ్వర్యంలో ఘనంగ సన్మానించారు. గురువారం డి. హిరెహాళ్ మండలం కళ్యం గ్రామంలోని బాలమేధావి ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణలో ఆ పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఆమెను అభినందించి సత్కరించి సన్మానం చేశారు. అనంతపురం జిల్లా రాయదుర్గం పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త జాతీయ స్థాయిలో విశిష్ట గౌరవాన్ని అందుకున్నారని ఆ పాఠశాల కరస్పాండెంట్ తెలిపారు. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జగ్గయ్యపేటలో నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమెను జాతీయ స్త్రీ శక్తి అవార్డుకు ఎంపిక చేశారన్నారు. సమాజ సేవ, మహిళా సాధికారత, విద్యా విస్తరణ, సేవా కార్యక్రమాల్లో ఆమె చేసిన కృషిని గుర్తించి ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందజేయడం ఆశించదగ్గ విషయమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు అవగాహన కల్పించడం, విద్యకు ప్రోత్సాహం ఇవ్వడం వంటి కార్యక్రమాల ద్వారా అవార్డు గ్రహీత మంచి గుర్తింపు పొందారన్నారు. ప్రస్తుతం ఆమె బాల మేధావి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా సేవలు అందిస్తున్న ఆమె ఈ అవార్డుకు ఎంపిక కావడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించి ఆనందం వ్యక్తం చేశారు. విద్యతో పాటు సమాజ సేవలో కూడా ముందుండే ఉపాధ్యాయులు మా విద్యాసంస్థలో విధులు నిర్వహించడం తమకు ఎంతో గర్వకారణమని, ఆమె సాధించిన ఈ గౌరవం బాల మేధావి స్కూల్‌కే కాకుండా రాయదుర్గం పట్టణానికి గర్వకారణమని ఆయన కొనియాడారు. ఆమె భవిష్యత్తులో విద్యా రంగం, మహిళా సాధికారత కోసం మరింత సేవ చేయాలని స్కూల్ యాజమాన్యం, సహచర ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

# వృధా అవుతున్న శ్రీరామిరెడ్డి త్రాగునీరు

బ్రహ్మసముద్రం మార్చి 5 ప్రభాతవార్త



శ్రీరామ రెడ్డి తాగునీరు వృధా అవుతున్న దృశ్యం

మండలంలోని నాగిరెడ్డిపల్లి ఫారెస్ట్ వద్ద శ్రీరామిరెడ్డి తాగునీటి పైపైన్ ప్రజల దాహం తీర్చడంలోముఖ్య పాత్ర వహిస్తున్న శ్రీ రామిరెడ్డి తాగునీరు వృధా అవుతున్న అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు ఇప్పటికైనా వేసవి దృష్ట్యా ప్రజల దాహం తీర్చే శ్రీ రామిరెడ్డి తాగునీటి వ్యవస్థను తాగునీరు వృధా కాకుండా అధికారులు చర్యలు చేపడతారా వేచి చూడాలి

# సమన్వయంతో పని చేద్దాం చిన్నారుల ఆరోగ్యం రక్షిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి శ్రవణ్ కుమార్

డి.హిరెహాళ్ మార్చి 5 ప్రభాతవార్త

శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో పని చేస్తూ చిన్నారు ల బంగారు భవిష్య త్తుకు బాటలు వేద్దామని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రవణ్ కుమార్ పిలు పునిచ్చారు. గురువా రం డి.హిరెహాళ్ మండల కేంద్రంలో ని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వైద్యాధికారి నాగులాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జస్వంత్, అంగనవాడి సూపర్వైజర్ ఉషారాణి లతో కలిసి అంగనవాడి, ఆశ కార్యకర్తలకు చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడం, తక్కువ బరువుతో పుట్టిన బిడ్డను అంగనవాడి, ఆశ కార్యకర్తల పర్యవేక్షణలో వైద్య సేవలు అందిస్తూ వారి జీవితానికి సంరక్షణ కల్పించాల్సి న అవసరం ఉందని ఆయన సూచించారు. పిల్లలలో ఎదుగుదల, ఆరోగ్య పరీక్షలు చాలా అవసరమని, ప్రతి నెల బరువు, ఎత్తు పెరగాలి. తినే ఆహారంలో ప్రోటీన్లు, చిరుధాన్యాలు, క్యాల్షియం, ఐరన్, అయోడిన్ ఉప్పు చాలా అవసరమని వైద్యాధికారి వారికి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఆదేశాల మేరకు తల్లులకు, కిషోర్ బాలికలకు, గర్భవతులకు, బాలింతలకు అందరికీ అంగన్వాడి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు ఈ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందని వైద్యాధికారి తెలిపారు. ఈ అవగాహన సదస్సులో ఆరోగ్య, అంగనవాడి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# డైనింగ్ హాల్ ప్రారంభించిన జిల్లా కలెక్టర్

పుట్టపర్తి (కలెక్టరేట్), మార్చి 05, ప్రభాతవార్త



రిబ్బన్ కట్ చేసి డైనింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్

శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్ లో నూతనంగా ఏర్పాటు చేసిన డైనింగ్ హాల్‌ను జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ గురువారం ప్రారంభించారు. వేదమంత్రాల ఉచ్చారణ, ప్రత్యేక పూజా కార్యక్రమాలతో శాస్త్రోక్తంగా ఈ డైనింగ్ హాల్‌ను ప్రారంభించారు. కలెక్టరేట్‌లో పనిచేసే సిబ్బంది, మండలాల నుండి వివిధ పనుల నిమిత్తం వచ్చే సిబ్బంది సౌకర్యార్థం దీనిని ఏర్పాటు చేశారు. సిబ్బంది అందరూ ఈ భోజన శాలను సద్వినియోగం చేసుకోవాలని, పరిశుభ్రమైన వాతావరణంలో ఆరోగ్యకరంగా ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు. డైనింగ్ హాల్ ఏర్పాటు చేయడం పట్ల కలెక్టరేట్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ కు ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (డి ఆర్ ఓ)విజయసారథి, జిల్లా పౌరసరఫరాల అధికారి వంశీకృష్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్సూర్యనారాయణ రెడ్డి, జి.ఎస్ డబ్ల్యూఎస్ అధికారి సుధాకర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సక్సేనా, రిసర్వే ఏడీ విజయశాంతి, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్

# పదిలో మంచి ఉత్తీర్ణత సాధించాలి

గుమ్మఘట్ట మార్చి 05 ప్రభాతవార్త

పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు కు మంచి ఉత్తీర్ణత సాధించాలని డిప్యూటీ డీఈవో లక్ష్మన్న సూచించారు గురువారం మండలంలోని గుమ్మఘట్ట హెడ్క్వార్టర్ లో ఆయన హైస్కూల్ మరియు ఎంజెపి స్కూల్ ను సందర్శించారు ఆయన తోపాటు ఎంఈవో సోమశేఖర్ స్కూల్ హెడ్ మాస్టర్ ప్రిన్సిపాల్ ఉన్నారు పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు తో మాట్లాడుతు.... పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత రాణించేందుకు బాగా చదువుకుని సిద్దపాటు కావాలని మండల లోని ఉత్తీర్ణత శాతం పెంచాలని పలు సూచనలు అందించారు తదనంతరం గోనభావి ఎంజెపి స్కూల్ సందర్శించారు డిప్యూటీ డీఈవో లగా పదవి బాధ్యతలు చేపట్టిన మొదటి పర్యావేక్షణ గుమ్మఘట్ట మండలం వచ్చారని ఎంఈవో మరియు ఎం ఆర్ సి సిబ్బంది స్వాగతం పలుకుతూ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో లక్ష్మన్న ఎంఈవో సోమశేఖర్, హెడ్ మాస్టర్, ప్రిన్సిపాల్ , ఎం ఆర్ సి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

# ఫ్రీ కోటా సీట్ల కోసం ధరఖాస్తు చేసుకోండి

చిలమత్తూరు, మార్చి 5 ప్రభాతవార్త

విద్యా హక్కు చట్టం 2009, ఆర్‌సి నెంబర్ 12(1)(సి) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో అమలు చేసే 25 శాతం ఫ్రీ కోటా సీట్ల కోసం చిలమత్తూరు మండలంలోని విద్యార్థుల తల్లిదండ్రులు ధరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారులు హనుమంతరెడ్డి, సాల్మన్‌రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందుకు కేవలం 5 రోజుల సమయం మాత్రమే వుందన్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి 1వ తరగతి మరియు 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండలంలోని పేద విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించి తమకు ఇష్టమైన ప్రైవేట్ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో గానీ, సమీపంలోని సచివాలయంలో గానీ, లేదా మండల కేంద్రంలోని ఎంఆర్‌సిలో గానీ దరఖాస్తు చేసుకోవచ్చని వారు తెలియచేశారు.

# లేపాక్షి పోలీస్‌స్టేషన్‌కు చేరిన "10వ తరగతి" ప్రశ్నాపత్రాలు

లేపాక్షి, మార్చి 5 ప్రభాతవార్త



పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచిన ప్రశ్నాపత్రాలు

10వ తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు గురువారం లేపాక్షి పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 16వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు ముందస్తు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. కట్టుదిట్టమైన భద్రత మధ్య రూట్ ఆఫీసర్, లేపాక్షి మండల విద్యాశాఖాధికారి నాగరాజు ఆధ్వర్యంలో ఈ ప్రశ్నాపత్రాల తరలింపు ప్రక్రియ సాగింది. పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ల సమక్షంలో ప్రశ్నాపత్రాల బండిళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి, లెక్కలను సరిచూసుకున్నారు. అనంతరం వీటిని పోలీస్‌స్టేషన్‌లోని స్ట్రాంగ్ రూమ్‌లో అత్యంత భద్రత మధ్య భద్రపరిచారు. 10వ తరగతి పరీక్షలకు సంబంధించి మొదటి సెట్ ప్రశ్నాపత్రాలు పూర్తిగా అందాయని రూట్ ఆఫీసర్ నాగరాజు మీడియాకు తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలని అధికారులు సూచించారు.

# సెట్ 1 ప్రశ్న పత్రాలు ను పరీక్ష కేంద్రాలకు పంపిణీ..

కొత్తచెరువు మార్చ్ 5 ప్రభాతవార్త

ఈనెల 16వ తేదీ నుంచి జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన సెట్1ప్రశ్నపత్రాలను 107పరీక్ష కేంద్రాలకు పంపిణీ చేయడం జరిగిందని ఏసి లాజర్ తెలిపారు విజయవాడ నుంచి ప్రత్యేక వాహనంలో డీఈవో కార్యాలయానికి వచ్చాయి అక్కడి నుంచి కొత్తచెరువు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో డీఈవో కృష్ణప్ప, ఆర్డిఓ సువర్ణ ఏసీ లాజర్ ఆధ్వర్యంలో సెట్ 1 ప్రశ్న పత్రాలను భద్రపరిచారు అనంతరం అధికారుల సమక్షంలో పోలీస్ బందోబస్తు మధ్య 11 రూట్లలో 107 పరీక్ష కేంద్రాలకు ప్రశ్నాపత్రాలను పంపిణీ చేయడం జరిగిందని ఏసి లాజర్ తెలిపారు.

# సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

గుత్తి, మార్చి 5 ప్రభాతవార్త



సహాయ కార్మిక అధికారి మాట్లాడుతున్న దృశ్యం

భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సహాయ కార్మిక అధికారి రవీంద్రనాథ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివాహ బహుమతి, ప్రసూతి ప్రయోజన, సహజ మరణ సహాయ పథకం, అంత్యక్రియల ఖర్చుల పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్మికుల పేర్లు సంక్షేమ బోర్డులో నమోదై ఉండాలన్నారు, నమోదు రెన్యువల్ తీసుకున్న వారి కార్మికుల దరఖాస్తులను మాత్రమే స్వీకరిస్తామన్నారు. సంక్షేమ బోర్డు అందిస్తున్న పథకాలను, ప్రయోజనాలను సద్వినియోగపరుచుకోవాలని ఆయన కోరారు.

# పాత తహశీల్దార్ కార్యాలయంలో నవీకరణకుమొదలైన పనులు

## - అదనంగా నిర్మించిన గదులు, కట్టడాలను కూలదోస్తున్న ఆర్అండ్‌బీ అర్కెటెక్ట్ విభాగం



పాత తహశీల్దార్ కార్యాలయంలో సబ్ ట్రెజరీ నిర్వహణ సమయంలో నిర్మించి భవనాన్ని పడగొడుతున్న దృశ్యం

ఉరవకొండ, మార్చి 5 ప్రభాతవార్త

నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలోని బ్రిటీష్ కాలం 1910లో నిర్మించిన తహశీల్దార్ కార్యాలయ సముదాయం నవీకరణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. రోడ్లు భవనాలశాఖ అర్కెటెక్ట్ విభాగం ఆధ్వర్యంలో కార్యాలయంలో వివిధఅవసరాలకోసం నిర్మించుకున్న గోడలు, గదులను కూలదోస్తున్నారు. పురాతనమైన అద్భుతమైన అర్కెటెక్చర్‌తో హుందా తనం ఉట్టిపడేలా భవనంలోకి గాలి, వెలుతురు పుష్కలంగా ప్రసరించేలా నిర్మించిన భవన సముదాయాన్ని పరిరక్షించడంలో భాగంగా ఈ పనులు మొదలైనట్లు తెలుస్తోంది. బ్రిటీషు హయాంలో నిర్మితమైన ఈ భవన సముదాయంలోనే కొన్ని దశాబ్దాలపాటు రెవెన్యూ కార్యాలయం, సబ్ ట్రెజరీ, కోర్టు, సబ్‌జైల్ నిర్వహించగా కాలక్రమేనా ఆయా విభాగాలకు ప్రత్యేక భవనాలు ఏర్పాటు అయ్యాయి. నిన్నా మొన్నటివరకు రెవెన్యూ, సబ్ ట్రెజరీలు ఇక్కడే నిర్వహిస్తూ వచ్చిన విషయం తెలిసిందే. భవన సముదాయాన్ని బ్రిటీష్ పాలకులు నిర్మించిన సమయంలో ఎలా ఉందో అచ్చం అలాగే ఉండేలా నేడు అనవసరమైన కట్టడాలు, చేర్పులు మార్పులను తొలగిస్తున్నారు. పనులను ఆర్అండ్‌బీ ఏఈ నాగభూషణం పర్యవేక్షించారు.

# పరీక్షల సమయంలో మూతబడిన జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు

## -నిబంధనలు పాటించాలని నిర్వాహకులను హెచ్చరించిన పోలీసులు

వార్త ప్రభావం

ఉరవకొండ, మార్చి 5 ప్రభాతవార్త

ఉరవకొండ పట్టణంలో గురువారం ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు మూతబడ్డాయి. పరీక్షల సమయంలో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు మూసివేయాలన్న జిల్లా కలెక్టర్ అదేశాలు ఉరవకొండలో అమలుకు నోచుకోవడం లేదని 'వార్త'లో గురువారం 'పరీక్షలు జరుగుతున్నా మూతబడని జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు..!' అన్న శీర్షికన ప్రత్యేక కథనం వెలువడటంతో పోలీసు అధికారులు స్పందించారు. స్థానిక అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ బి.మహానంది జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్ల నిర్వాహకులను స్టేషన్‌ను రప్పించి నిబంధనలు పాటించకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈక్రమంలోనే ఇంటర్ పరీక్షలు జరుగుతున్న స్థానిక ఎస్.కె.ప్రభుత్వ జూనియర్, బాలికల జూనియర్ కళాశాలల పరీక్షా కేంద్రాలకు ఎదురుగా ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాన్న 12.45 గంటల వరకు మూసివేశారు. అయితే ప్రధాన రోడ్డు కాకుండా లోపలి వైపున నిర్వహిస్తున్న జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు మాత్రం తెరిచి కార్యకలాపాలు నిర్వహించుకోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసులు వాటిపై కూడా చ్యలు తీసుకోవాలని ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

# 10వ తరగతి ప్రశ్న పత్రాలు పోలీస్‌స్టేషన్‌లో భద్రం

అగళి, మార్చి 5 ప్రభాతవార్త



ప్రశ్నపత్రాలను భద్ర పరుస్తున్న ఎం‌ఈఓ, సిఐ

10వ తరగతి పబ్లిక్ పరీక్ష ప్రశ్న పత్రాలను అగళి పోలీస్‌స్టేషన్‌లో భద్ర పరిచినట్లు ఎంఈఓ చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. పబ్లిక్ పరీక్షలను జడ్పిహెచ్ఎస్ మధూడి, కెజిబివి అగళిలలో ప్రతిరోఊజు ఉదయం 8:40 గంటలకు ప్రశ్న పత్రాలను కస్టోడియన్ రవీంద్ర మూర్తి ఎస్ఐ ఆధ్వర్యంలో బయటకు తీసి పోలీసుల వెంట పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లాలని ఎఈఓ తెలిపారు. ఆ సమయంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని పరీక్ష సమయంలో జెరాక్స్ సెంటర్లు మూసివేయాలని తెలిపారు. పరీక్ష కేంద్రంలో మంచినీరు, ఓఆర్ఎస్ పాకెట్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ నెల 16 నుంచి వచ్చే నెల 1వ తేది వరకు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతాయని ఎంఈఓ తెలిపారు.

# బీజేవైఎం జిల్లా స్పోర్ట్స్ కన్వీనర్‌గా పామిశెట్టి శ్రీనివాసులు



ఎంపికైన పామిశెట్టి శ్రీనివాసులు

ధర్మవరం రూరల్ మార్చి 5 ప్రభాతవార్త

ధర్మవరం పట్టణానికి చెందిన పామిశెట్టి శ్రీనివాసులు శ్రీ సత్యసాయి జిల్లా బీజేవైఎం జిల్లా స్పోర్ట్స్ కన్వీనర్‌గా ఎంపికచేశారు. శ్రీసత్య సాయి జిల్లా కేంద్రంలో భారతీయ జనతా యువమోర్చా అధ్యక్షుడు బిల్లే కుల్లయప్ప, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ కార్యాలయంలో మంత్రి ఇన్చార్జ్ హరీష్ బాబును కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ అపారమైన నమ్మకంతో పదవిని అప్పజెప్పారని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కృషి చేస్తూ క్రీడాకారుల ప్రోత్సాహానికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. స్నేహితులు, క్రీడాకారులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# దేవాలయాలను ప్రభుత్వం ఆధీనం నుండి తొలగించాలి

ధర్మవరంటౌన్ , మార్చి 5 ప్రభాతవార్త



మాట్లాడుతున్న డాక్టర్ వివేక్ కుల్లాయప్ప యాదవ్

హిందూ దేవాలయాలను ప్రభుత్వం ఆధీనంనుండి తొలగించాలని, స్వతంత్ర హిందూ సనాతన బోర్డు ఏర్పాటుచేయాలని హిందూ సమ్మేళనా కమిటి ఉపాధ్యక్షులు, జయకృష్ణ ట్రస్టు అధ్యక్షులు డాక్టర్ వివేక కుల్లాయప్పయాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక ఆశా ఆస్పత్రి వద్ద ఆయన చేపట్టిన నిరాహార దీక్షలు గురువారం ఏడవ రోజు చేరాయి. ఈ దీక్షకు జల్లాకార్తీక్, జుజురునాగరాజు, శ్రీనివాసులు,దారాపోతలయ్య, పృథ్వీ, యాదవ్ నాగరాజు, రంగనాథ్ మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ....ఆనాటి నుంచి నేటి వరకు హిందూదేవాలయాలలో జరుగుతున్న అన్యాయాలు, పరిష్కరించని సమస్యలపై దీక్షలు చేపట్టాన న్నారు. గత కొన్ని సంవత్సరాలుగా తాము హిందూ ధర్మం కాపాడడం కోసంఅనేకపోరాటాలు చేశామన్నారు. హిందూమైనార్టీ విద్యాసంస్థలు ఏర్పాటు కు అనుమతించాలని, పూజారులకు రూ.15వేలు ఇవ్వాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఆస్పత్రులలో 24గంటలపాటు ఎంబీబీఎస్ డాక్టర్. అందుబాటు లోఉండాలన్నారు. దేవాలయమాన్యాలుఆక్రమణలనుతొలగించాలని, హిందూ మైనార్టీ విద్యాసంస్థలు ఏర్పాటుకు అనుమతించాలని డిమాండ్ చేశారు.

# వ్యవసాయశాఖ ఏడీ కార్యాలయం ముందు ఏపీ రైతు సంఘం ధర్నా

## -ఎంఎస్‌పీ, బోనస్‌తో కలిపి క్వింటాల్‌కు రూ.8000కు ధర నిర్ణయించాలి -పప్పుశెనగ కొనగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్





వ్యవసాయశాఖ ఏడీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

ఉరవకొండ, మార్చి 5 ప్రభాతవార్త

పప్పుశెనగ పంట కొనగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గురువారం పట్టణంలోని వ్యవసాయ సహాయ సంచాలకులు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బి.హెచ్.రాయుడు, సహాయ కార్యదర్శి ఎస్.మధుసూదన్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎ.రంగారెడ్డి మాట్లాడుతూ 2025-26 రబీ పంట కాలంలో రైతులు సాగు చేసిన పప్పుశెనగ పంటను ప్రభుత్వం ఎంఎస్‌పీ 5,650 రూపాయలు, బోనస్ 2,350 రూపాయలు కలిపి క్వింటాల్ 8,000 రూపాయలతో పంట కొనగోలు చేయాలన్నారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం ప్రభావంతో ఈ ప్రాంతంలో రోజురోజుకూ పప్పుశెనగ ధర తగ్గిపోతోందన్నారు. దళారులు, వ్యాపారులు కుమ్మక్కై రైతుల శ్రమను దోచుకుంటున్నారన్నారు. దీంతో రైతులకు దిక్కుతోచక గోడౌన్లలో పంటను నిల్వ చేసుకొంటున్నారని అయితే కొద్దిమంది చిన్న, సన్నకారు రైతులు ఆర్థిక ఇబ్బందులతో ఏదో ఒక రేటుకు అమ్ముకొని నష్టపోతున్నారన్నారు. అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలను అవకాశంగా చేసుకొని ఒక క్వింటాల్‌కు 5 కేజీల తరుగు తీసుకొని వ్యాపారులు రైతులను నిలువునా దోచుకొంటున్నారన్నారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎంఎస్‌పీ, బోనస్ కలిపి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అమలు చేయాలన్నారు. కలెక్టర్ చొరవ తీసుకొని తరుగు తీసుకొంటున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. గోడౌన్లలో నిలువు చేసుకున్న రైతుల పప్పుశెనగకు వాటి పత్రాల ఆధారంగా వాయిదాల ద్వారా బ్యాంకులో లోన్ ఇచ్చే సౌకర్యం ప్రభుత్వం వెంటనే కల్పించాలన్నారు. రబీ పంట కాలంలో సాగైన పంటలకు ఈ-క్రాప్ నమోదు చేసిన వారికి రసీదులు వెంటనే చెల్లించి ఈ పంటలకు ఉచిత ఇన్సూరెన్స్ అమలు చేయాలన్నారు. పంట, బంగారం తాకట్టుపెట్టి రుణాలు తీసుకున్న రైతులకు వడ్డీ మాత్రమే కట్టించుకొని రుణాలు రెన్యూవల్ చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు శీనప్ప, సిద్దప్ప, నాయకులు మురళి, రామాంజినేయులు, శివ, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# బాల్యంలో వేసే అడుగులే... జీవితానికి బంగారు బాటలు

## వానవోలు హైస్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం 20 రోజుల కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిడిఓ కమలాబాయి సూపర్వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో కార్యక్రమాలు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో.

గోరంట్ల మార్చి 05 ప్రభాత వార్త

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సిడిపిఓ డాక్టర్ శాంతలక్ష్మి ఆదేశానుసారం, సూపర్వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో గోరంట్ల మండలం లోని వానవోలు గ్రామంలోనీ హై స్కూల్ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం 20 రోజుల కార్యక్రమం లో భాగంగా నాల్గవ రోజు ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడమైనది. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్‌సూపర్వైజర్‌నాగరాణి మాట్లాడుతూ కిశోర వయస్సు అనేది జీవితంలో చాలా ముఖ్యమైన దశ. ఈ సమయంలో మన ఆరోగ్యం, చదువు, భవిష్యత్తు గురించి సరైన అవగాహన ఉండటం చాలా అవసరం. ప్రతి బాలిక తన శరీరాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. పోషకాహారం తీసుకోవాలి. రక్తహీనత (అనీమియా) రాకుండా పచ్చి కూరగాయలు, పండ్లు, గుడ్లు వంటి ఆహారం తినాలి. ఎంపీడీవో కమలా బాయి మాట్లాడుతూ బాలికలు చక్కగా చదువు కోవాలని పిలుపునిచ్చారు. చదువు మన జీవితాన్ని మార్చగలిగే శక్తి. కాబట్టి ప్రతి బాలిక చదువుపై దృష్టిపెట్టాలి. మంచి లక్ష్యాలు పెట్టుకుని వాటిని సాధించడానికి ప్రయత్నించాలి అని తెలియజేశారు. ఐసిపిఎస్ కౌన్సిలర్ శివలత మాట్లాడుతూ భద్రత. ఎక్కడైనా అసౌకర్యంగా అనిపించినప్పుడు వెంటనే తల్లిదండ్రులు, టీచర్లు లేదా పెద్దలకు చెప్పాలి. అవసరమైతే 1098, 181 వంటి హెల్ప్‌లైన్ నంబర్లను ఉపయోగించాలి. నాలుగవది బాల్య వివాహం నివారణ. 18 సంవత్సరాలు పూర్తికాకముందు పెళ్లి చేసుకోవడం చట్ట విరుద్ధం. ముందుగా చదువు పూర్తి చేసి, మీ భవిష్యత్తును నిర్మించుకోవాలి అని పిల్లలకు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయుడు శ్రీనివాసులు ,ఉపాధ్యాయురాలు ఈశ్వరమ్మ,మహిళా కార్యదర్శి ఆయేషా , ఏఎన్ఎం అశ్విని, అంగన్వాడి టీచర్లు శోభా,జ్యోతి,నాగలక్ష్మి పాల్గొన్నారు.

# ధర్మవరం అభివృద్ధి, పారిశుద్ధ్యంపై నిరంతరం పర్యవేక్షణ



హమాలీ కార్యాలయం పరిసరప్రాంతాలను పరిశీలిస్తున్న బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జ్ హరీశ్ బాబు

ధర్మవరంటౌన్ , మార్చి 5 ప్రభాతవార్త

ధర్మవరం అభివృద్ధి, పారిశుద్యంపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని నియోజకవర్గ బీజేపీ ఇన్చార్జ్ హరీశ్ బాబు పేర్కొన్నారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ లో నేషనల్ హమాలీ యూనియన్ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించి అక్కడి హమాలీలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. హమాలీలు తమ కార్యాలయానికి అనుకుని ఉన్న డ్రైనేజీ కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వ్యాపిస్తూ పరిసర ప్రాంతాల్లో అస్వచ్ఛత నెలకొని ఆరోగ్యసమస్యలు తలెత్తే పరిస్థితి ఉందని ఆయన దృష్టికి తెచ్చారు. సమస్యను విన్న వెంటనే ఆయన మున్సిపల్ అధికారులతో తక్షణమే మాట్లాడి హమాలీ కార్యాలయ పరిసర ప్రాంతాలలో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని సూచించారు. పారిశుద్యకార్మికులు చెత్తా చెదారాన్ని తొలగించారు.

# ఉచిత కంటి మెగా వైద్యశిభిరాన్ని సద్వినియోగం చేసుకోండి

## - డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు, రఘువీర్‌రావ్



నల్లపాటి తిరు పతినాయుడు



రఘువీర్ రావ్

పామిడి, మార్చి 05 ప్రభాతవార్త

లయన్స్‌క్లబ్ ఆద్వర్యంలో బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అందత్వ నివారణ సంస్థ వారు శ్రీ భావ సార క్షత్రీయ కళ్యాణ మండపం నందు ఈనెల 8న ఆదివారం నిర్వహిస్తున్న ఉచిత కంటి మెగా వైద్యశిభి రాన్ని సద్విని యోగం చేసుకోవాలని ఆసంస్థ వ్యవస్థాక అద్యక్షులు, ప్రభుత్వ ఆయుష్ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు, అద్యక్షులు రఘువీర్ రావు గురువారం 'ప్రభాతవార్త' ద్వార ప్రజలకు పిలుపుని చ్చారు. ఉచిత కంటి మెగా వైద్యశిభిరంలో బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి కంటి వైద్యనిపుణులు కంటిచూపు మందగించిన వారిని పరీక్షించి అందుకనుగుణంగా మందులను పంపిణీ చేస్తారని అవసరమైతే ఆపరేషన్లకు రెఫర్ చేస్తారన్నారు. ఆపరేషన్లకు రెఫర్ అయి న వారిని బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి ఆర్గనైజర్లు ప్రత్యేక బస్సు ల్లో తీసుకెళ్ళి ఆపరే షన్లు చేసిన తరువాత తిరిగి వారిని సురక్షితంగా గమ్యస్థా నాలకు చేరుస్తారని తెలి యజే శారు. కంటి వైద్యశిభిరానికి హాజరయ్యే వారంతా ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్టుసైజు ఫోటోలు తీసుకుని రావాలని డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు, రఘువీర్‌రావు కోరారు.

# ప్రభుత్వ పప్పుశనగ కొనుగోలు కేంద్రం ఏర్పాటు



పప్పుశనగ కొనుగోలు కేంద్రంను ఏర్పాటు చేసిన అధికారులు

బుక్కరాయసముద్రం మార్చి 5 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం మండల పరిదిలోని రేగడ ి కొత్తూరు గ్రామంలో ప్రభుత్వ మద్దతు ధరతో నాఫెడ్ వారి ఆధ్వర్యంలో పప్పుశనగ కొనుగోలు కేంద్రంను గురు వారం ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి శ్యామ్ సుందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగ ఆయన మాట్లడుతూ 15 మంది రైతులు ప్రభుత్వ మద్ద తు ధరతో అమ్మడానికి రిజిస్ట్రేషన్ చేసుకోవడమై నది. ప్రభుత్వం 5875 రూపాయల మద్దతు ధరతో కొను గోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. మండలంలో నల్లరేగడి భూములు ఉన్న నాలుగు గ్రామాలలో పప్పు శనగ సాగుచేసిన దాదాపు 242 ఎకరాలలో 98 హెక్టా ర్లలో పప్పుశనగ పంట రైతులు సాగుచేయడం జరిగింది. అక్టోబర్ మొదటి వారంలో సాగుచేసిన రైతులు అందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనవలెను. ప్రభుత్వ ం నుండి అనుమతి రాగానే కొనుగోలు కొరకు రిజిస్ట్రేషన్ ప్రారంబిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు గ్రామ వ్యవసాయ సలహాదారులు చౌడేశ్వరి, గ్రామ రైతు లు ఈశ్వరయ్య, రామా నాయుడు, రామాంజి నేయులు, రామిరెడ్డి, కొనుగోలు కేంద్రం నిర్వహ కులు అమర్నా థ్‌రెడ్డి, నిర్మల తదితిరులు పాల్గొన్నారు.

# రైలు కింద పడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య



రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన గుర్తు తెలియని యువకుడు



ఘటనా స్థలికి వెళ్లి దర్యాప్తు చేస్తున్న రైల్వే ఎస్సై వెంకటేష్

అనంతపురం క్రైమ్

మార్చి 5, ప్రభాతవార్త

పాతికేళ్ల వయసున్న గుర్తుతెలియని ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మ హత్య చేసుకున్న ఘటన అనంత పురం లోని రామ్ నగర్ రైల్వే గేట్ ప్రాం తంలో గురువారం చోటుచేసు కుంది. స్థానిక రైల్వే ఎస్సై వెంకటేష్ కథనం మేరకు నగరంలోని రాంనగర్ రైల్వే గేటు వద్ద గుర్తు తెలియని యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. సుమారు 25 నుండి 30 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని యువకుడు ఈ ఘాతుకానికి పాల్పడ్డాడన్నారు. రెడీ మేడ్ షర్టు, జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. దీం తో రెడీమేడ్ షర్టు కాలర్ టైలర్ లేబుల్ కనుగొనేం దుకు అవకాశం కూడా లేకపోయిందన్నారు. మృతుడు ఏ ప్రాంతానికి చెందిన వాడు, ఆత్మహత్యకు దారి తీసిన కారణాలు తెలి యరాలేదన్నారు. విషయం తెలిసిన వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి దర్యాప్తు చేపట్టా మన్నారు. కేసు నమోదు చేసుకుని యువకుడి మృతదే హాన్ని అనంత పురం సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తు న్నట్లు ఆయన వివరించారు.

# గార్లదిన్నె పంచాయతీపై ఆకస్మిక తనిఖీ..

## బకాయిల చెల్లింపుపై హెచ్చరిక..



గార్లదిన్నె పంచాయతీ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి సమీక్ష.

గార్లదిన్నె, మార్చి 05, ప్రభాతవార్త :

గార్లదిన్నె గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని అనం తపురం జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయు డు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులు, పన్నుల వసూళ్ల రిజిస్టర్లు, పన్నేతర ఆదాయ వివరాలను పరిశీలించారు. గ్రామంలో ఇంటి పన్నులు, నీటి పన్నులు మరియు ఇతర పన్నేతర బకాయిల వసూళ్లు ఆశించిన స్థాయిలో జరగడం లేదని గమనించి, వెంటనే వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు .ప్రస్తు తం గార్లదిన్నె గ్రామ పంచాయతీకి సుమారు రూ.4 లక్షల మేర బకాయిలు ఉన్నట్లు వెల్లడించారు. ఈ బకా యిలను త్వరితగతిన వసూలు చేయకపోతే గ్రామా భివృద్ధి పనులు దెబ్బతింటాయని తెలిపారు. పారిశు ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ వంటి ప్రాథమిక సౌకర్యాల మెరుగుదలకు పన్నుల వసూళ్లు కీలకమని పేర్కొన్నారు.

గ్రామస్తులు తమ బకాయిలను వెంటనే చెల్లించి గ్రామపంచాయతీ అభివృద్ధికి సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి కోరారు. పంచాయతీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించి బకాయిల వసూళ్లను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో ఎంపిడిఓ ఎం గోపాల్, పంచాయతీ కార్యదర్శి ఖాదర్ వలి, కార్యాలయ సిబ్బంది మరియు పంచాయతీ వర్కర్లు పాల్గొన్నారు.

# ఎస్‌వి ఐటి కళాశాల విద్యార్థులు ఇండస్ట్రీయల్ విజిట్‌లో భాగంగా సబ్ స్టేషన్‌ల సందర్శన



సన్మానిస్తున్న దృశ్యం



సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న దృశ్యాలు

రాప్తాడు, మార్చి 5 ప్రభాతవార్త

ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రా నిక్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు 220కెవి/ 132కెవి/33 కెవి/ 11కెవి సబ్‌స్టేషన్, బుక్క రాయ సముద్రం వద్ద ఇం డస్ట్రీ విజిట్ నిర్వహిం చినట్లు శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల కరస్పాండెంట్ వి.బి.ఆర్. శర్మ తెలిపారు. ఈ సంద ర్భంగా చైర్మన్ బి.వి.కృష్ణా రెడ్డి, వైస్ చైర్మన్ వెన్నెపూస రవీంద్ర రెడ్డి కూడా తెలిపారు. ఈ ఇండస్ట్రీ విజిట్‌లో విద్యార్థులు సబ్‌స్టేషన్‌లోని 220కెవి/132కెవి/ 33కెవి /11కెవి ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలు, ట్రాన్స్‌ఫార్మర్లు, స్విచ్‌గేర్‌లు, ప్రొటెక్షన్ సిస్టమ్స్ వంటి అంశాలపై ప్రత్యక్షంగా అవగాహన పొందారు. సబ్‌స్టే షన్‌లో విద్యుత్ సరఫరా ఎలా నిర్వహించబడు తుంది. భద్రతా చర్యలు ఎలా అమలు చేస్తారు అనే విషయాలను డి.ఇ.వెంకటరమణ వివరిం చారు. ఈ సందర్భంగా కళాశాల ఎం.డి.వెన్నెపూస రమాకాంత్ రెడ్డి, ప్రిన్సిపల్ డా.టి.విష్ణు వర్ధన్ మాట్లాడుతూ. .ఇలాంటి ఇండస్ట్రీ విజిట్స్ ద్వారా విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ పెరుగుతుందని తెలిపారు. అలాగే ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా.కె.జ్యోతి, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డి. షేక్షావలి అధ్యాపకుడు దండు శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మాగలూరి సంకల్పం సిద్ధి ఎందరికో ఆదర్శం

### కరువు నేలలో కుబేర హిల్స్ పట్టుదలే మాగులూరి లక్ష్యం - వి ఆర్ ఎం గ్రూప్స్ తో వేలాదిమందికి ఉపాధి అవకాశాలు 23 ఏళ్లలో 100 కోట్ల టర్నోవర్ తో పరిశ్రమల స్థాపన - ఘనంగా విఆర్‌ఎం గ్రూప్స్ అధినేత మాగులూరి వెంకటేశ్వరరావు 57 వ జన్మదిన వేడుకలు - మాగులూరి జన్మదిన వేడుకలలో పాల్గొన్న ఎంపీ బీకే పార్ధసారథి తదితర ప్రముఖులు



ఎంపీ సమక్షంలో కేక కట్ చేస్తున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పార్ధసారథి



నూతన పరిశ్రమను ప్రారంభిస్తున్న కొరియన్స్

గోరంట్ల మార్చి 5 ప్రభాతవార్త.

దీక్ష పట్టుదలే ఆయన లక్ష్యంగా పెట్టుకుని ఎడారిగా ఉన్న కొండ గుట్టల బీడు భూములలో నేడు అందరూ ఆశ్చర్యంగా చూసేలా పరిశ్రమలు స్థాపించి వీఆర్ఎం గ్రూప్ తో వేలాదిమందికి ఉపాధి అవకాశాలు ప్రత్యక్షంగా పరోక్షంగా ఉద్యోగాలు కల్పిస్తున్న మాగులూరి వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు కుబేర హిల్స్ లో అంగరంగ వైభవంగా నిర్వహిం చారు, ఈ కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్ సభ్యులు బీకే పార్ధసారథి తోపాటు కృష్ణజా కన్‌స్ట్రక్షన్స్ ఎండి వైవి కృష్ణా రావు, రిటైర్డ్ ప్రొఫెసర్ కేవీఎన్ రెడ్డి, ఫైన్ టూల్స్ ఎండి కుషా, శ్యామ్ వ్యూ ప్యాకింగ్ సొల్యూషన్ జన రల్ మేనేజర్ కిమ్, సీయోల్ స్టోర్ ఎండి ఫలని, కుంకాంగ్ ఎం డి కాంసిక్ హమ్, హుందాయి గ్లోబిస్ మేనేజింగ్ డైరెక్టర్ గన్ వుమ్ కిమ్, కు ప్యాకింగ్ క్వాలిటీ శ్రీ హాన్ జాంగ్ క్యూ తదిత రులు పాల్గొని మొగులూరు వెంకటేశ్వరరావుకు పూలమాలలు శాలు వాలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు, ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న బీకే పార్థసారథి మాట్లాడుతూ.. 2012లో మాగులూరితో తనకు పరిచయం ఏర్పడినప్పటి నుండి తనకు ఎన్నో సహాయ సహకారాలు అందించడం జరిగిందని, తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఈ ప్రాంతం అభివృద్ధి చేస్తున్న తరుణంలో గ్రేట్ వే తో పాటు వీఆర్ఏ గ్రూప్స్‌కు కావలసిన సహాయ సహకా రాలను ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యం లో అందించడం జరిగిందన్నారు, అలాగే ఆయన ఎదుగుదల ను ఓర్వలేక కొంతమంది ఆటంకాలు కలిగిస్తున్న సమయంలో ఆయనకు వెన్నంటి ఉండి ప్రోత్స హించడం జరిగింది అన్నారు, లా అండ్ ఆర్డర్ విఫలం కాకుండా జాగ్రత్తలు తీసుకున్నామని పరిశ్రమల స్థాపన కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు, ఈ ప్రాంతం పరిశ్రమల స్థాపనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కియా పరిశ్రమతో పాటు బెల్ నాసిన్ ఎయిర్ బస్‌తోపాటు ఎన్నో పరిశ్రమలు తీసుకురావడం జరిగిందని కేంద్ర ప్రభుత్వం శ్రీ సత్య సాయి జిల్లాలోని పాల సముద్రం పెనుగొండ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించారన్నారు, అలాంటి తరుణంలో మాగులూరి వెంకటేశ్వరరావు ఒక లక్ష్యంతో మరొకరికి సహాయం చేయాలని దయాగుణంతో 23 సంవత్సరాలుగా సమస్త అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు,

ఆధునిక సాంకేతికతో పరిశ్రమను మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని అభినంది ంచారు. అనంతరం పాలస ముద్రం క్రాస్ వద్ద ఉ న్నఎక్సోటిక్ ఇన్నో వేషన్ ఇంజనీరింగ్ సంస్థలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధు నిక యంత్రాలను వి ఆర్ ఎం గ్రూప్స్ 23 సంవత్సరాల ప్రస్థానంలో భాగంగా ఎక్సలెన్స్ వేడుకల సందర్భంగా ఘనంగా ప్రారంభించారు, ఈ సందర్భంగా పరిశ్రమలో అత్యధిక సాంకేతికతతో కూడిన య ంత్రాలు సంస్థలు ఏర్పాటు చేసినట్లు మాగులూరి వెంకటేశ్వర రావు ప్రకటించారు, అలాగే సిక్స్ కే డబ్ల్యూ సిఎంసి ఫైబర్ లేజర్ కటింగ్ మిషన్, సిక్స్ మీటర్ సిఎంసి ప్రెస్ బ్రేక్, సిఎంసి షేరింగ్ లైన్, లేజర్ వెల్డింగ్ స్పాట్ వెల్డింగ్ సిస్టమ్స్, స్ట్రక్చర్డ్ ఐఎస్ఓ బెస్ట్ ప్రొడక్షన్ లో ఈ యంత్రాల ద్వారా ఉత్పత్తి నాణ్యత వేగం మరియు సామర్థం గణనీయంగా పెరుగుతాయని తెలిపారు, దేశీయ మరియు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉత్పత్తుల తయారు చేయడం ఈ యంత్రాల ద్వారా మరింత సులభం అవుతుందని పేర్కొన్నారు, అనంతరం కుటుంబ సభ్యులు వీఆర్ఏ గ్రూప్స్ సిబ్బంది మరియు ప్రముఖుల నడుమ కేక్ కటింగ్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు, అలాగే 5 సంవత్సరాలు సమస్తలో క్రమశిక్షణతో పనిచేస్తున్న మేనేజర్లు ఉద్యోగులకు ఒక నెల వేతనం బోనస్‌తో పాటు సర్టిఫికెట్లు అందజేసి ఘనంగా సత్కరిం చారు, ఈ కార్యక్రమంలో సోమందేపల్లి తహసిల్దార్ మారుతి, సహకార సంఘం చైర్మన్ బెల్లల చెరువు చంద్ర, మనోహర్, మూర్తి ,రిటైర్డ్ ఉపాధ్యా యులు చేన్న కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ నియో జకవర్గ అధ్యక్షులు పాలసముద్రం నరసింహులు, రంగారెడ్డి తో పాటు పెద్ద ఎత్తున ఉద్యోగులు అభిమానులు పాల్గొన్నారు.

# పీఎస్ హెచ్‌ఎం సమస్యలపై డీఈఓకు వినతి



డిఇఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, మార్చి 5 ప్రభాతవార్త

ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిం చాలని గురువారం సాయంత్రం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసా ద్ బాబుకు పిఎస్ హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.రామాం జనేయు లు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.సత్య నారా యణ రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో గత ఏడాది బదిలీల్లో భాగంగా రేషనలైజే షన్‌లో భాగంగా జిల్లాలో దాదాపు 530 మంది స్కూల్ అసిస్టెంట్లు ఖాళీలు లేవని నెపంతో పీఎస్ హెచ్‌ఎం/ఎస్ ఏ డిసిగ్నేషన్‌తో ప్రాథమిక ప్రాథ మికోన్నత, ఉన్నత పాఠశాలకు బదిలీ చేయడం జరిగింది. కావున 2026 బదిలీల కంటే ముందే జీరో సర్వీస్‌తో విల్లింగ్ ఉన్న పిఎస్ హెచ్‌ఎం/ఎస్‌ఎలను వారి వారి సబ్జెక్టు స్కూల్ అసిస్టెంట్లను తిరిగి ఉన్నత పాఠశాలలకు పంపుటకు మీ సహకారం చాలా అవసరం అన్నారు. అలాగే స్కూల్ అసిస్టెంట్ జాబితాలో సీనియారిటీలో పొందుపర చాలని పిఎస్ హెచ్/ఎస్ఎలకు జాబ్ చార్ట్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమ ంలో పిఎస్ హెచ్‌ఎంల సంఘం స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ రంగారెడ్డి, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ సర్దార్, జిల్లా కార్యదర్శి శివ శంకర్ రెడ్డి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన జిల్లా స్థాయి సైన్స్ వారోత్సవాలు

అనంతపురం న్యూటౌన్, మార్చి 5 ప్రభాతవార్త

జిల్లా స్థాయి వారోత్సవాలు జెఎన్‌టియుఏలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో జరిగాయి. ఇందులో పోస్టర్ ప్రెజెంటేషన్ (ఇండియన్ స్పేస్ టెక్నాలజీ), క్విజ్ (వుమెన్ ఇన్ సైన్స్), డిబేట్ (సుస్థిర అభివృద్ధి), ఫాన్సీ డ్రెస్ (సైంటిస్ట్స్) సెమినార్ (సైన్స్ ఇన్ ఎవరీ డే) మొదలగు అంశాల మీద జరిగిన పోటీలలో మొదటి బహుమతి హెచ్.ఉమ్ముల్‌హుదా జడ్పిహెచ్‌ఎస్ గర్ల్స్ (రాయదుర్గం), రెండవ బహుమతి ఎన్.వీరేంద్రనాథ్ డా.రాజేంద్రప్రసాద్ ఎంపిఎల్ స్కూల్ గుంతకల్లు, 3వ బహుమతి కె.అఖిలేష్ (ఎంపియుపి హనిమిరెడ్డిపల్లి పోస్టర్ సీనియర్ విభాగంలో అలాగే మొదటి నిహారిక ఎంపియుపి ఎల్లనూరు, 2వ ఎన్.గ్రేర్వాని ఎంపియుపి నెంబర్ 1 యాడికి, పి.జాహ్నవి (3వ), డా.బిఆర్.అంబేద్కర్ గురుకుల (ఉరవకొండ) జూనియర్ విభాగంలో అవార్డు పొందారు. క్విజ్ సీనియర్ విభాగంలో పి.జగదీష్ (1మొదటి) జడ్పిహెచ్‌ఎస్ దోసలుడికి( గుంతకల్లు) హేమలత (2వ) హెచ్‌ఎస్‌ఎస్ ఎర్రగుంట్ల(కణేకల్లు), కె.అశ్విని (3వ) జడ్పిజిహెచ్‌ఎస్ గుత్తి అలాగే జూనియర్ క్విజ్ విభాగంలో కె.సందిని (1మొదటి) డా.బిఆర్ .అంబేద్కర్ గురుకులం (ఉరవకొండ), బి.తనూజ(2వ), డిబేట్‌లో వి.తనూజరెడ్డి (1మొదటి), ఎపిఎంఎస్ రాప్తాడు, ఎం.నవీన్‌కుమార్ (1వ), కల్లిమతం హై స్కూల్ (రాయదుర్గం), బి.సుహాసిని (3వ) జడ్పిహెచ్‌ఎస్ కోనుప్పలపాడు జూనియర్ విభాగం క్విజ్‌లో బి.అక్షిత, ఎంపియుపిఎస్ హనిమిరెడ్డిపల్లి ఫాన్సీడ్రెస్ సీనియర్ విభాగంలో బి.రిషిక (1మొదటి) వైష్ణవి (2వ), కెజిబివి తాడిపత్రి, ఎస్.గోవర్దన్ (3వ), కల్లిమటం ఎంపిఎల్ స్కూల్- రాయదుర్గం, ఫానీ స జూనియర్ విభాగంలో టి వికాస్(1మొదటి), ఎంపిపిఎస్ జి.అనంతపురం, పునీత్(2వ) జడ్పిహెచ్‌ఎస్ దోసలుడికి గుంతకల్లు, ఎస్.సుహానా (3వ) ఎంపిపిఎస్ ఎల్లంపేట, సెమినార్ సీని యర్ విభాగంలో ఎస్.ఆఫీఫా (1మొదటి) జడ్పిహెచ్‌ఎస్ రాయదుర్గం, హెచ్.హర్షిత(డా.బిఆర్. అంబేద్కర్ గురుకులం ఉరవకొండ), కౌసల్య కెజిబివి తాడిపత్రి, సెమినార్ జూనియర్ విభాగంలో హెచ్‌డి గంగోత్రి డా.బిఆర్.అంబేద్కర్ గురుకులం ఉరవకొండ, అవార్డు పొందారు వీరికి డిఇఒ ప్రసాద్ బాబు, ఎపిసి సమగ్ర శిక్ష శైలజ, ముఖ్య అతిథిగా హాజరైన అగస్త్య ఫౌండేషన్ (కుప్పం) ఆర్గనైజర్ పుష్ప వీరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ సెమినార్ హాజరైన టీచర్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# క్రీడలు విద్యార్థుల జీవితంలో భాగం కావాలి

## - రిజిస్ట్రార్ కృష్ణయ్య



క్రీడాకారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న రిజిస్ట్రార్ కృష్ణయ్య

అనంతపురం సిటీ, మార్చి 5 ప్రభాతవార్త

క్రీడలు విద్యార్థుల జీవితంలో భాగం కావాలని జెఎన్‌టియు రిజిస్ట్రార్ కృష్ణయ్య సూచించారు. జెఎన్‌టియుఏ కళాశాల స్పోర్ట్స్ డే కార్యక్రమాన్ని గురువారం ఎన్టీఆర్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిజిస్ట్రార్ కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల వల్ల విద్యార్థుల్లో సామాజిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు అభివృద్ధిచెందుతాయని సూచించారు. దీంతోపాటు టీం వర్క్ భావన పెంపొంది ఏకాగ్రత పెరగడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులుచదువుతోపాటు క్రీడల్లో చురుకుగా పాల్గొనాలని ఆయన సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి మాట్లాడుతూ.. జీవితంలో గెలుపు ఓటములు సహజనమని క్రీడల ద్వారా ఆ లక్షణాలను పెంపొందించుకునేందుకు దోహద పడుతుందన్నారు. ఈ సందర్భంగా క్రీడలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లతోపాటు మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ బోజిరెడ్డి, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రెటరీ నారాయణరెడ్డితోపాటు పలు విభాగాల హెచ్‌ఓడిలు పాల్గొన్నారు.

# రేపు కూడేరులో బిజెపి పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణా కార్యక్రమం



మాట్లాడుతున్న భాజపా నాయకులు

కూడేరు, మార్చి 5 ప్రభాతవార్త

మండల కేంద్రం నందు భారతీయ జనతా పార్టీ బిజె పి రాష్ట్ర అధ్యక్షులు, పీవీఎస్ మాధవ్, అనంత పురం జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ ఆదేశాల మేరకు ఏడవ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు పండిట్ దీన దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభి యాన్ కార్యక్రమం లో భాగంగా స్థానిక మండల కేంద్రం కూడేరు లోని శ్రీ భగవతి ఫంక్షన్ హాల్ నందు కడగం కుంట రోడ్డు సమీపంలోని శివరావు ఫంక్షన్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కార్యక్ర మాన్ని అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు మండల స్థాయిలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి బిజెపి పార్టీని గ్రామస్థాయి నుండి బలోపేతం చేయడం కొరకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్, మండల అధ్యక్షులు నాగరాజు, విలేకరులకు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మహా అభియాన్‌లో భాగంగా మం డలాల వారీగా నిర్వహించనున్న ప్రశిక్షకుల శిక్షణా తరగతులు విజయవంతంగా జరిగేలా మండల పర్య టనలో భాగంగా కూడేరు మండలంలో బీజేపీ నాయకు లతో సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్ర మంలో బీజేపీ జిల్లా అధ్యక్షులుకొనకొండ్ల రాజేష్ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు దామోదర్, మండల అధ్యక్షులు నాగరాజు, బీజేపీ ప్రముఖులు పాల్గొన్నారు. పార్టీ బలోపే తమే లక్ష్యంగా ప్రతి మండలంలో శిక్షణా కార్యక్ర మాల ను సమర్థవంతంగా నిర్వహించాలని, కార్య కర్తల సామ ర్థ్యాన్ని పెంపొందించి సిద్ధాంతపరమైన బలం కల్పిం చాలని నాయకులు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కిసాన్, మోర్చా నాయకు లు.రామాంజనేయులుకొర్రకోడు గోపాల్, బిజెపి కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు కె మలోబులు, కొత్తపల్లి బోయ ఈశ్వరయ్య, ఈశ్వరయ్య, బిజెపి దళిత మోర్చా నాయకులు శ్రీనివాసులు, బాలకృష్ణ, ఎస్టీసెల్ జిల్లా నాయకులు వెంకటేష్ నాయక్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పలు వివాహా కార్యక్రమాలకు హాజరై మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



వివిధ శుభకార్యాలలో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



రాప్తాడు, మార్చి 5 ప్రభాతవార్త

రాప్తాడు మండల పరిధిలోని బండమీదపల్లి గ్రామానికి చెందిన గురు ప్రసాద్ రెడ్డి కుమార్తె రాధిక-లోకేశ్వర్ రెడ్డి దంపతుల వివాహానికి రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. రాప్తాడు మండలం పాలబావి గ్రామానికి చెందిన చిన్నపోతులయ్య కుమార్తె రామలక్ష్మి- రాజశేఖర్ దంపతుల వివాహనికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

# 35 కుటుంబాలకు అండగా నిలిచిన బళ్ళారి రూరల్ ఎమ్మెల్యే నాగేంద్ర





యుద్ధ ఉద్రిక్తతల మధ్య దుబాయ్‌లో చిక్కుకున్న బళ్లారి వాసులు సురక్షితంగా స్వగృహాలకు

బళ్లారి, మార్చి, 05 ప్రభాతవార్త :

టూర్ ప్యాకేజీలో భాగంగా ఫిబ్రవరి 23న బళ్లారి నుండి దుబాయ్‌కు బయలుదేరిన 35 కుటుంబాలు, ఫిబ్రవరి 28న తమ టూర్ ముగించుకుని షార్జా విమానాశ్రయానికి చేరుకున్నారు. అదే రోజు అమెరికా -ఇజ్రాయిల్-ఇరాన్ మధ్య యుద్ధ ఉద్రిక్తతలు ప్రారంభమ వడంతో పరిస్థితులు ఒక్కసారిగా మారాయి. యుద్ధ పరిణామాల నేపథ్యంలో షార్జా విమానాశ్రయంపై దాడు లు జరగడంతో భారత్‌కు వచ్చే విమానాలను రద్దు చేశారు. ఈ అనూహ్య పరిస్థితుల్లో బళ్లారికి చెందిన 35 కుటుంబాలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని భయాం దోళనల మధ్య నాలుగు రోజుల పాటు అక్కడే నిలిచిపో యారు. స్వదేశానికి ఎలా చేరుకోవాలనే ఆందోళనలో గడిపారు. విషయం తెలిసిన వెంటనే బళ్లారి రూరల్ ఎమ్మెల్యే నాగేంద్ర స్పందించారు. దుబాయ్‌లో ఉన్న కుటుంబాల యోగక్షేమాలను తెలుసుకుని, సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరిపి వారి సురక్షిత ప్రయాణానికి చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే చొరవతో 35 కుటుం బాలను దుబాయ్ నుండి కొచ్చి విమానాశ్రయా నికి తరలించారు. అక్కడి నుండి వారు బెంగళూరు విమానాశ్రయానికి చేరుకున్నారు. అనంతరం కొచ్చి నుండి బళ్లారి వరకు ప్రత్యేక రవాణా సౌకర్యాన్ని ఎమ్మెల్యే నాగేంద్ర తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేసి, కుటు ంబాలను సురక్షితంగా స్వగృహాలకు చేర్చించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు హృదయపూ ర్వక కృతజ్ఞతలు తెలిపారు. దుబాయ్ నుండి తిరిగి వచ్చిన వారిలో యాల్పి పంపన్న గౌడ్ కుటుంబం కూడా ఉంది. స్వగ్రా మానికి చేరుకున్న వెంటనే వారి ఇంట్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశా యి. కుటుంబ సభ్యులు దివాకర్ గౌడ్, వందన, ప్రణిత్ మరియు బంధువులు హర్షాతిరేకాలతో సంతోషాన్ని పంచుకున్నారు. కష్టకాలంలో అండగా నిలిచి సహాయం చేసిన ఎమ్మెల్యే నాగేంద్ర సేవలను ప్రజలు ప్రశంసిస్తూ, ప్రజాప్రతినిధిగా ఆయన చూపిన బాధ్యత, చొరవ అభినందనీయమని పేర్కొన్నారు.

**CHANGE OF SURNAME**

I, Mulla Answar Basha (old name) S/o. Late Mulla Shaikshavali, Residing at D.No. 10/912, Cherlopalli Street, Gooty Town, Ananthapuramu District, AP PIN - 515401, I have changed my Surname from MULLA ANWAR BASHA (old name) to **SHAIK ANWAR BASHA** (new name). Hence forth my name will be called as **SHAIK ANWAR BASHA** for all purposes S/o. Late Shaik Shaikshavali.

04ATP05_04ATP05.qxd 05-03-2026 PM 11:18 Page 1



# పెళ్లి వేడుకలో మిత్రుల కలయిక

## ఏపీ ఆర్థిక మంత్రి హోదాలో ఒకరు... కాబోయే రాజ్యసభ సభ్యుని హోదాలో మరొకరు

అనంతపురం, మార్చి 5, (ప్రభాతవార్త బ్యూరో)
తెలంగాణ నుంచి రాజ్యసభకు ఎంపికైన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డికి ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాదులో గురువారం తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తనయుని వివాహ కార్యక్రమానికి ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ హాజరయ్యారు. అదే కార్యక్రమానికి వచ్చిన వేం నరేందర్ రెడ్డిని ఆ వేడుకలో కలిశారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డిని అప్యాయంగా ఆలింగనం చేసుకున్న మంత్రి పయ్యావుల కాబోయే రాజ్యసభ సభ్యునికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో తన మిత్రులిద్దరిలో ఒకరు సీఎం హోదాలో ఉండగా. మరొకరు రాజ్యసభకు ఎన్నికవుతున్నందుకు సంతోషంగా ఉందని మంత్రి పయ్యావుల అన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న ప్పటి సంగతులు... విభజన తర్వాతి పరిణామాలపై మాట్లాడుకున్నారు. తన తెలంగాణ మిత్రులు సీఎం రేవంత్ రెడ్డి, సలహాదారు వేం నరేందర్ రెడ్డి కష్టాల్లో నూ కలిసే ఉన్నారంటూ గతంలో జరిగిన పరిణామాలను పయ్యావుల గుర్తు చేసుకున్నారు.



నరేందర్ రెడ్డిని ఆప్యాయంగా కలు సుకున్న మంత్రి పయ్యావుల కేశవ్

# ఫిర్యాదులన్నింటికీ పరిష్కార మార్గం చూపించాలి

## -అహుడా గ్రీవెన్స్‌లో చైర్మన్ టి.సి.వరుణ్

అనంతపురం మార్చి 05 ప్రభాతవార్త
అహుడా పరిధిలో వచ్చిన ప్రతి ఫిర్యాదుకు పరిష్కార మార్గం చూపించాలని అహుడా చైర్మన్ టి.సి.వరుణ్, వైఎస్ చైర్మన్ విష్ణుచరణ్‌లు అధికారులకు సూచించారు. గురువారం స్థానిక అహుడా కార్యాలయంలో నిర్వహిం చిన గ్రీవెన్స్ కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనం తరం అధికారుల సమీక్షలో వారు మాట్లాడుతూ అహుడా పరిధిలోని లేఔట్లల్లో మౌళిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. నగరం లో పింక్ టాయిలెట్స్, స్విమ్మింగ్ ఫూల్ నిర్మా ణాలు చేపట్టాలని, పంచాయతీ కార్యదర్శులతో కలిసి అహుడా అనుమతి లేని లేఔట్లను క్రమబద్దీకరణ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ అధికారి కె.ఎం.డి.ఇషాక్, ఈఈ దుశ్యంత్, డిఈ రేవంత్, జెపిఓ హరీష్‌చౌదరి, పబ్లిక్ హెల్త్ ఈఈ సూర్యనారాయణ, ఈఓ అరుణ, సర్వేయర్ శరత్ తదితరులు పాల్గొన్నారు.




అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న అహుడా చైర్మన్,వైఎస్ చైర్మన్‌లు

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయండి

## - రూ.6,300 కోట్లు బకాయిలకు రూ.1,200 కోట్లు విడుదల చేశామనడమేంటి
## - రాష్ట్ర శాసన మండలిలో నిలదీసిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

ఉరవకొండ, మార్చి 5 ప్రభాతవార్త
రాష్ట్రంలోని విద్యార్థులకు ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి కోరారు. గురువారం రాష్ట్ర శాసన మండలిలో ప్రత్యేక నివేదన ద్వారా ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ఎమ్మెల్సీ వై.శివరా మిరెడ్డి మాట్లా డుతూ గత సెప్టెంబర్‌లో విడతల వారిగా కళాశాలలకు రావాల్సిన పెండింగ్ ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను చెల్లిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం 9 క్వార్టర్లకు సంబంధించి దాదాపు 6,300 కోట్ల రూపాయల బకాయిలు ఉంటే కేవలం 1,200 కోట్ల రూపాయలు విడుదల చేశామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చెప్పడమేంటని ప్రశ్నించారు. కానీ ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలతో మాత్రం ప్రస్తుతానికి 1,200 కోట్ల రూపా యలు ఇవ్వలేము, ప్రత్యామ్నాయంగా సదరు బకాయిల మొత్తానికి బ్యాం కుల ద్వారా 8శాతం వడ్డీకి ఫైనాన్స్ ఇప్పిస్తాము, నిధులు విడుదల అయ్యాక అసలు ప్రభుత్వం జమచేస్తే వడ్డీ మాత్రం కళాశాలలే భరించాలని ప్రభుత్వం చెప్పడం ఎంతవరకు సమంజసం అంటూ ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ ఇటువంటి పరిస్థితి చూడలేదని, ఈ ప్రభుత్వం అసమర్థ తకు ఇది నిదర్శనమన్నారు.

ప్రభుత్వం ఫీజు రీయిం బర్స్ మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశా లలను నడిపే పరిస్థితి లేదని ప్రైవేటు ఇంజనీ రింగ్, పాలిటెక్నిక్, డిగ్రీ కళా శాలల అసోసియేషన్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయన్నారు. కళాశాలల నిర్వహణ కోసం బ్యాంకుల నుంచి తీసు కునే రుణాల్లో ఓవర్ డ్రాఫ్ట్ పరి మితి కూడా దాటిపోయిందని ఆవే దన చెందుతున్నారన్నారు. అప్పులు కట్టడానికి మళ్లీ అప్పులు చేయడం, అప్పు పుట్టే దారి లేకపోవడంతో విద్యా సంస్థల ఆర్థిక పరిస్థితి దిగజారి పోయి ందని, కాలేజీలు మూసివేసే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. అయితే ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఈనెల..వచ్చేనెల అంటూ మాటలు చెప్పుకుంటూ దాటవేయడం తప్ప రూపాయి విడుదల చేయకుండా కాలం గడుపుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని, ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలకు బ్యాంకుల ద్వారా 8శాతం వడ్డీకు ఫైనాన్స్ ద్వారా ఇప్పిస్తామనే అలోచన విరమించి వారికి బకాయిలు వెంటనే చెల్లించాలి వారికి న్యాయం చేయాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

# రామ్మోహన్ రావు సేవలు 'ఆర్టీసి' మరువలేనిది

## - ఆశయాలను కొనసాగిస్తా.. వర్ధంతి సభలో ఎన్ఎంయు నేతలు

అనంతపురం మార్చి 05 ప్రభాతవార్త
ఆర్టీసిలో కార్మిక, ఉద్యోగుల సంక్షేమం కోసం విరోచితంగా పోరాటాలు చేసి ఎన్నో విజయాలను సాధిం చి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన మహోన్నత వ్యక్తి, నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయు)వ్యవ స్థాపకులు రామ్మోహన్ రావు అని, ఆయన ఆశయాలను కొనసాగిస్తామని డిపో నాయకులు పేర్కొన్నారు. రామ్మో హన్ రావు 21వ వర్ధంతిని పురస్కరించి స్థానిక ఆర్టీసి డిపో వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి డిపో నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ వర్ధంతి సభకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా చైర్మన్ వి.సూరి బాబు మాట్లాడుతూ మంచికి, మానవ త్వానికి అహర్ని శలు పాటుపడుతూ ఉద్యోగ, కార్మికుల సంక్షే మమే తన ధ్యేయంగా పనిచేసిన మహనీయుడు స్వర్గీయ రామ్మోహ న్‌రావు అని కొనియాడారు. ఆర్టీసి చరిత్రలో ప్రతి ఆరు నెలలకు ఒక ఆటోమెటిక్ డిఏ అమలుకు, ఎస్ఆర్‌బి ఎస్, ఎస్‌బిటిలను ప్రవేశపెట్టడానికి, గ్రేడ్-3ని రద్దు చేయించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఒక ఇండిపెండెంట్ ట్రేడ్ యూనియన్‌ను ఆర్టీసీలో స్థాపించి దాదాపు 38 ఏళ్ల ప్రధాన కార్యదర్శిగా వ్యహరించి కార్మికుల ఆశాజ్యోతిగా, రాజీవ్ రత్న అవార్డు గ్రహీతను అందుకుని ఎన్ఎంయూను ఒంటిచేత్తో నడిపించి గెలుపు బాటలు వేసిన వ్యక్తి మార్చి3, 2005న అనారోగ్యంతో మృతి చెందడం యూనియన్‌కు తీరనిలోటన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయు డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ఎన్.రెడ్డి, పి.రామాంజినేయులు, ముఖ్య ఉపాధ్యక్షుడు నారాయణస్వామి, వర్కింగ్ అధ్యక్షులు వి.రాజ శేఖర్, ట్రెజరర్ సి.శ్రీరాములు, గ్యారేజ్ అధ్యక్షులు బి.శ్రీనివాసులులతో కమిటి నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



డిపో ఎదుట ఘనంగా నివాళులు అర్పిస్తున్న ఎన్ఎంయు నాయకులు

# పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం విడనాడాలి - కమిషనర్ జస్వంత రావు

అనంతపురం మార్చి 05 ప్రభాతవార్త
పారిశుద్ధ్య నిర్లక్ష్యాన్ని విడనాడి అంకితభావంతో పనులు చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.జస్వంత రావు పారిశుద్ధ్య పర్యవేక్షణ అధికారులకు, కార్మికులకు హితవు పలికారు. గురువారం ఆయన సాధారణ పర్యవేక్షణలో భాగంగా రామచంద్రనగర్, శ్రీనివాసనగర్, షిర్డీనగర్, ఎం.జి. కాలనీ, వేణుగోపా ల్‌నగర్, గుత్తి రోడ్డు, సూర్యానగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా రోడ్ల శుభ్రత, మురికి కాలువల్లో పూడికతీత పనులను పరిశీలిస్తూ, స్థానికులతో మమేకమై కార్మి కులు ఏ విధంగా పనిచేస్తున్నారు.. రోజూ ఇంటింటి చెత్త సేకరణ చేసు న్నారా.. అంటూ ఆరా తీశా రు. అనంతరం రైల్వేస్టే షన్ సమీపంలో వున్న అన్నా క్యాంటీన్‌లో అల్పాహార నా ణ్యతను పరిశీలించారు. ఈ పర్యవేక్షణలో ఇన్‌చార్జ్ ఆ రోగ్య అధికారి బి.ఎల్. నర సింహా, శానిటేషన్ పర్య వేక్ష ణ అధికారులు పాల్గొన్నారు.




పారిశుద్ధ్య నిర్వహణ ఎలా వుందంటూ ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్

# నియోజకవర్గ అభివృద్ధిపై సిఎంకు దగ్గుపాటి విజ్ఞప్తి

అనంతపురం మార్చి 05 ప్రభాతవార్త
అర్బన్ నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఎమ్మెల్యే దగ్గుపాటి పలు సమస్యలను పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గురువారం ఉండవల్లి నివాసంలో అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించగా, ఇన్‌చార్జ్ మంత్రి టి.జి.భరత్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు, ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు జె.సి.అస్మిత్‌రెడ్డి, గుమ్మనూరు జయరాం, బండారు శ్రావణిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ నగరంలో నడిమివంక, మరువ వంక ప్రొటెక్షన్ వాల్స్ ఏర్పాటు, నగరంలో మౌళిక వసుతుల కల్పన కోసం రోడ్లు, మంచినీటి సరఫరా, వీధిలైట్లు, పబ్లిక్ టాయిలెట్స్ కోసం నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే శిల్పారామంలోని పార్కులో అహ్లాదకరం కోసం వచ్చే జనాల కోసం ఏర్పాటు చేసిన పరికరాలన్ని శిథిలావస్థకు చేరుకు న్నాయని, గత ప్రభుత్వ హాయంలో పట్టించుకోలేదని ఇందుకోసం నిధులు కేటాయించాలని, అలాగే ముద్దలాపురంవద్ద 16 ఎకరాల్లో సోలార్ పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



ఉండవల్లిలోని సిఎం నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న జిల్లా ప్రజాప్రతినిధులు

# సత్యసాయి పాలియేటివ్ కేర్, క్యాన్సర్ సెంటర్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్

శ్రీ సత్యసాయి జిల్లా, మార్చి 05, ప్రభాతవార్త ప్రతినిధి
పుట్టపర్తి లోని స్థానిక శ్రీ సత్యసాయి పాలియేటివ్ కేర్, క్యాన్సర్ సెం టర్‌ను జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. క్యాన్సర్ చివరి దశలో ఉన్న రోగులకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఈ కేంద్రం అందిస్తున్న ఉచిత సేవలు అభినందనీయమని కలెక్టర్ కొనియాడారు. జిల్లాలో క్యాన్సర్ పట్ల అవగాహన పెంచాలని, ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి సేవా సంస్థలకు ప్రభు త్వం తరపున అవసరమైన సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఆసుపత్రిలోని మెడికల్ ఎక్విప్‌మెంట్, పాలియేటివ్ కేర్ విభాగాల పనితీరును ఆయన ప్రత్యక్షంగా చూసి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి నిర్వాహకులు, వైద్యులు, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

# షిరిడీ సాయి బాబా మందిరంలో 26వ వార్షికోత్సవం

అనంతపురం, మార్చి 5 ప్రభాతవార్త బ్యూరో
నగరంలోని వేమన భవన్ వద్ద ఉన్న మన షిరిడీ సాయి బాబా మందిరంలో 26 వ వార్షికోత్స వ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా గురువారం స్వామి వారికి విశేష అలంకరణ, పూజలు, నారా యణ సేవ నిర్వహించారు.

మందిరం అధ్య క్షులు జయచంద్ర చౌదరి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు నాగానందం, రవీంద్రనాథ్, శ్రీరా ములు, వెంకటనారాయణ, వేంకటగిరి, రవిప్రకాష్ గార్ల సౌజన్యంతో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడు కల్లో భక్తాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వచ్చిన భక్తాదులకు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం సుమారు 1200 మంది భక్తాదులకు అన్న ప్రసాద వితరణ గావించారు.



షిర్డిసాయిబాబా మూల విరాట్



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తాదులు

# లేపాక్షి శిల్పకళ అద్భుతం - సుప్రీంకోర్టు న్యాయమూర్తి కె.వి విశ్వనాథన్

లేపాక్షి, మార్చి 5 ప్రభాతవార్త
చారిత్రక, ఆధ్యాత్మిక క్షేత్రమైన లేపాక్షి ఆలయంలోని శిల్పకళా సంపద, చిత్రకళ అద్భుతంగా ఉందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.వి.విశ్వనాథన్ కొనియాడారు. గురువారం ఆయన సతీసమేతంగా లేపాక్షి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన గోపురం వద్దకు చేరుకున్న జస్టిస్ విశ్వనా థన్ దంపతులకు ఆలయ అర్చకులు లక్ష్మీనరసింహాశర్మ, శ్రీనివాస్ కుమార్‌లు మంగళవాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో ఆల యంలోకి ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు ఆల యం లోని చవితి వినాయకుడు, ఏడు శిరస్సుల నాగేంద్రున్ని దర్శించుకున్నారు. అసంపూర్తిగా ఉన్న కళ్యాణ మండపం, సీతమ్మ పాదం, "అంతరిక్ష స్తంభాన్ని" ఆశ్చర్యంతో తిలకించారు. శిల్పాలలో దాగి ఉన్న చారిత్రక నేపథ్యాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనం తరం గర్భాలయం లోని శ్రీదుర్గా, వీరభద్రస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహి ంచారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఈఓ ఎం.హెచ్. నరసింహమూర్తి న్యాయ మూర్తిని శాలువాతో సత్కరించి, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ సివిల్ జడ్జి రాకేష్, తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎస్ఐ నరేంద్ర, ఇతర అధికారులు, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.



లేపాక్షి ఆలయ చరిత్రను తెలు సుకుంటున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.వి.విశ్వనాథన్



. లేపాక్షి ఆలయాన్ని సందర్శిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి

# హెరిటేజ్ వాక్ క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం

అనంతపురం న్యూటౌన్, మార్చి 5 ప్రభాతవార్త
జిల్లా కలెక్టర్ మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు రాష్ట్ర పురావస్తు, ప్రదర్శనశాలల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో హెరిటేజ్ వాక్ క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ వారసత్వ యాత్ర ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణం నుండి ప్రారంభమై పీస్ మెమోరియల్ హాల్, కోర్ట్ రోడ్ వరకు కొనసాగించారు. ఈ సందర్భంగా ఎపిఎస్‌సి డబ్ల్యుఎ స్టేట్ సెక్రటరీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. పురావస్తు శాఖ ఇలాంటి కార్యక్రమాల ద్వారా నగరంలోని చారిత్రక, పురావస్తు ప్రాధాన్యత గల కట్టడాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం ఎంతో శుభపరిణామకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు మరియు పురావస్తు శాఖ సిబ్బంది ఉత్సా హంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినం దుకుగాను పురావస్తు శాఖ సహాయ సంచాలకులు యం.స్వామి నాయక్, సిబ్బందిని అభినందించారు.



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

# సీఎం చంద్రబాబు నాయుడు ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్ మార్చి 5 ప్రభాతవార్త.
మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు, శ్రీసత్యసాయి జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ని అసెంబ్లీలో గురువారం ఉదయం కలిశారు. మడకశిర నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వివరించారు. వాటితో పాటు నియోజక వర్గంలోని పలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. 20నెలల కూటమి పాలనలో మడకశిరలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ముఖ్యమంత్రికి వివరించారు. శ్రీసత్యసాయిజిల్లా మరియు మడకశిర నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీ బలోపేతం, నాయకులు, కార్యకర్తలు, అధికారుల మధ్య స మన్వయం వంటి అంశాల న్ని ంటిపై సీఎంకు పూర్తివి వరా లు అందించారు. మడకశిర అ భివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని సీఎం హామీ ఇచ్చా రు. ముఖ్యమంత్రి సానుకూ ల స్పందనపై టిటిడి బోర్డు మెంబర్, ఎమ్మెల్యే ఎం.ఎస్. రా జు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తి ప్పేస్వామి కృతజ్ఞతలు తెలియజేశారు.

# జిల్లా సైన్స్ సెంటర్ ఆండ్రాయిడ్ యాప్, వెబ్ సైట్ లాంచింగ్

అనంతపురం న్యూటౌన్, మార్చి 5 ప్రభాతవార్త
అనంతపురం జె.ఎన్.టి.యు సమీపంలోని జిల్లా జిల్లా సైన్స్ సెంటర్ గురువారం జిల్లా సైన్స్ సెంటర్‌లో అగస్త్య ఫౌండేషన్ సిఈఓ పుష్ప, జిల్లా విద్యాశాఖ అధికా రి ప్రసాద్ బాబు జిల్లా సైన్స్ సెంటర్ ఆండ్రాయిడ్ యాప్, వెబ్ సైట్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా అగస్త్య ఫౌండేషన్ సిఈఓ పుష్ప మాట్లాడుతూ.. తాడిపత్రిలోని సార్ సివి రామన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నా లజీలో సి.ఎస్.సి తృతీయ సంవత్సరం చదువుతున్న చాంద్ హాఫీజ్ నవాజ్ జిల్లా సైన్స్ సెంటర్ ఆండ్రాయిడ్ యాప్, వెబ్ సైట్‌ను రూపొందించడం గర్వకారణమ న్నారు. తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి చాంద్ హాఫీజ్ నవాజ్ ఆండ్రాయిడ్ యాప్, వెబ్ సైట్ ను రూపొందించాడని, విద్యార్థులు నూతన ఆలోచ నలు ఉంటే జిల్లా సైన్స్ సెంటర్ క్యూరేటర్ బాల మురళీ కృష్ణను కలువాలని, ఆయన విద్యార్థులలోని విభిన్న ఆలోచనలు కార్యరూపం దాల్చేలా కృషి చేస్తారని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు మాట్లాడుతూ.. నీ ఆలోచన సరళి చాలా బాగుందని, చాలా గొప్పపని చేశావని చాంద్ హాఫీజ్ నవాజ్‌ను అభినంది ంచారు. సైన్స్ సెంటర్ క్యూరేటర్ బాల మురళీకృష్ణ మాట్లాడుతూ.. సైన్స్ సెంటర్‌కు చాంద్ హాఫీజ్ నవాజ్ తరచుగా వస్తుండేవాడని, విద్యార్థిలోని ఆసక్తిని గమనించి ప్రాజెక్టును అప్పగించానని తెలిపారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఉచితంగా ప్రాజెక్టును, అనుకున్న దానికంటే ప్రాజెక్టును చాలా గొప్పగా రూపొందించాడని అభినందించారు.



జిల్లా సైన్స్ సెంటర్ ఆండ్రాయిడ్ యాప్, వెబ్ సైట్‌ను లాంచ్ చేస్తున్న దృశ్యం